www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 7 ఏప్రిల్ 2024

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్
కోనసీమ

నియోజకవర్గ పరిధిలో సెక్షన్లు 30,144 అమలు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్న దృష్ట్యా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ మరియు 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ముమ్మిడివరం సిఐ ఎన్. కొండయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి కార్యక్రమానికైన అనుమతులు తప్పని సరిగా పొంది ఉండాలని ఆయన తెలిపారు. అమలాపురం డిఎస్‌పి ఎం. మహేశ్వరరావు ఆదేశాల మేరకు నియోజక వర్గ పరిధిలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లో వివిధ రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటి వాటికి ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. మతపరమైన జాతరలు ఊరేగింపులకు అనుమతులు తప్పనిసరి అన్నారు. ఎక్కడా డీజే సౌండ్ సిస్టమ్ ఉపయోగించరాదని, వీటిని నిబంధన అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

భానుడి భగభగలు

- 40 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రత లు
- ఎండలతో అల్లాడుతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా మారుతున్న మెయిన్ రోడ్లు
- జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచనలు

ప్రజాశక్తి-అమలాపురం/రామచంద్రపురం

జిల్లా వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు భారీగా పెరిగిపోతున్నాయి. ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత మొదలవుతోంది. ఏప్రిల్ మొదటి వారంలోనే 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మెయిన్ రోడ్లన్నీ కర్ఫ్యూ వాతావరణం తలపిస్తున్నాయి. రోజంతా ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. శనివారం జిల్లాలో అధిక స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ వేసవి సీజన్‌లోనే అత్యధికంగా 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదయ్యాయి. మధ్యాహ్నం 12 దాటితే రోడ్లపై నిప్పుల కుంపటిని తలపిస్తోంది. ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశాలుండటంతో వడదెబ్బ ప్రభావం పొంచి ఉన్నట్లు వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎండ వేడిమికి ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. ప్రజలు ఎండ కి రోడ్ల పైకి రావడానికి భయపడుతున్నారు. మధ్యాహ్నానికి రోడ్లన్నీ నిర్మానుషం గా తయారవుతున్నాయి. ప్రయాణికులు ఎండలకు భయపడి ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు. ఇక చంటి పిల్లలు వద్ధులు ఎండలకు తాళలేక అల్లాడిపోతున్నారు. ఉక్కపోతతో సతమత మవుతున్న ప్రజలు చెట్ల నీడలకు చేరి సేద తీరుతున్నారు. ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందడానికి ప్రజలు కొబ్బరిబండాలు, పుచ్చకాయలు, శీతల పానీయాలకు ఎగబడుతున్నారు. వీటితో వాటి డిమాండ్ అమాంతంగా పెరిగిపోయింది. ఒక్కొక్క జ్యూస్ రూ.40 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నారు. మే నెలలో నమోదయ్యే ఉష్ణోగ్రతలు ఏప్రిల్ నెలలో నే నమోదు అవ్వడంతో ఇక మే నెలలో పరిస్థితి ఏమిటని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వ్యాపారాలు లేకపోవడంతో దుకాణాలు వెలవెలబోతున్నాయి. మరో మూడు రోజులపాటు ఉక్క పోత, వడగాల్పులు, ఉంటాయని వాతావరణ శాఖ తెలియజేసింది



నిర్మానుష్యంగా అమలాపురం ప్రధాన రహదారి



నిర్మానుష్యంగా రాజమహేంద్రవరం-రామచంద్రపురం మెయిన్‌రోడ్డు

ప్రజలంతా వడగాల్పులు పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది. ఉష్ణోగ్రతలు పెరగడంతో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు అత్యవసరమైతే తప్ప పగలు బయటకు తీసుకురావద్దని చెబుతున్నారు. వారు త్వరగా డీ-హైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు.


వడదెబ్బ గురికాకుండా పాటించాల్సిన జాగ్రత్తలు

కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బ నుంచి తప్పించుకోవచ్చు. తలకు రుమాలు కట్టుకోవాలి. ప్రతి 5 నుంచి 10 నిమిషాలకు ఒకసారి నీరు తాగాలి. వడదెబ్బకు గురైన వారిని, ఎండలో తిరిగి మూర్ఛపోయిన వారిని వెంటనే చల్లటి ప్రదేశానికి తరలించాలి. ముఖంపై నీటిని చల్లి, స్పహ వచ్చిన తరువాత నెమ్మదిగా కొంత చల్లటి మంచినీరు తాగించాలి. వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తరలించాలి. కొబ్బరి నీళ్ల, పళ్లరసాలు, ఉప్పు, చక్కెర కలిపిన నీటిని తాగించాలి.

వృద్ధులు, పిల్లలను ఎండలోకి తీసుకురావద్దు

వృద్ధులు, పిల్లలు చాలా సున్నితంగా ఉంటారని, తీవ్రమైన సూర్యరశ్మిని వారు తట్టుకోలేరని అమలాపురానికి చెందిన వైద్యనిపుణులు డాక్టర్ ఎ.సుబ్బారావు అన్నారు. తీవ్రమైన ఎండలో పిల్లలను బయట తిరుగనిస్తే డీ-హైడ్రేషన్‌కు గురవుతారన్నారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు. అత్యవసరమైతే తప్ప పిల్లలను ఎండలో బయటకు తీసుకురాకూడదన్నారు. పిల్లలకు కాటన్ దుస్తులు వేయాలన్నారు. పిల్లలను ఉంచే గదులు చల్లగా ఉండే విధంగా జాగ్రత్తపడాలన్నారు.

వడగాల్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా వడగాల్పుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలి. చిన్నపిల్లలు, వృద్ధులు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బయటకు రావద్దు. ఎండలో వడదెబ్బ తగిలితే వెంటనే చల్లని ప్రాంతానికి తీసుకువచ్చి ఒఆర్‌ఎస్ ద్రావణాన్ని తాగించాలని తడి బట్టతో వంటిన తుడవాలి. కనీసం ఐదు లీటర్ల నీటిని రోజు తీసుకోవాలి. దీంతోపాటుగా కొబ్బరి బొండం నీళ్ల మజ్జిగ వంటివి వేసవిలో ఎంతో మంచిది. రైతులు పొలం పనికి వెళ్లే కూలీలు తమ వెంట మంచినీళ్ల తప్పనిసరిగా తీసుకువెళ్లాలి. అత్యవసరమైనప్పుడు వడదెబ్బ తగిలిన వారిని వెంటనే ఆసుపత్రికి తీసుకువచ్చి చికిత్స తీసుకోవాలన్నారు.

-ఎస్.ప్రవీణ్,సూపరింటెండెంట్ ఏరియా ఆసుపత్రి, రామచంద్రపురం

హౌసింగ్ గోదాముల్లో వార్షిక తనిఖీలు

ప్రజాశక్తి-ఆలమూరు



స్టాక్ పరిశీలిస్తున్న హౌసింగ్ డిఇ మల్లికార్జునరావు

మండల పరిధి హౌసింగ్ శాఖ గోదాముల్లో రామచంద్రపురం హౌసింగ్ డిఇ కె.మల్లికార్జునరావు శనివారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్మాణానికి సంబంధించిన వివిధ సరుకుల నిల్వలు, సంబంధిత రికార్డులను ఆయన పరిశీలించి, నిల్వలు సరిపోవడంతో సంతప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్ నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే సంబంధిత రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకుంటూ అప్డేట్‌గా ఉండాలన్నారు. లబ్ధిదారుల గుర్తింపులో ఎటువంటి అవకతవకలకు పాల్పడవద్దని ఆయన హెచ్చరించారు. అలాగే స్థానిక అధికారులు అడిగిన పలు అనుమానాలను నివత్తి చేసి, సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక హౌసింగ్ ఎఇ డి.శ్రీనివాస్, రామచంద్రపురం హౌసింగ్ ఎఇ సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, ప్రసాద్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు దుర్గా ప్రసాద్, రాజారావు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎంసిసి'ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఎన్నికల ప్రత్యేక అధికారి, డిఎల్‌డిఒ రాజేశ్వరరావు

ప్రజాశక్తి-ఆలమూరు



మాట్లాడుతున్న రాజేశ్వరరావు

మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్(ఎంసిసి)ను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల ప్రత్యేక అధికారి, డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎస్‌టివి.రాజేశ్వరరావు స్థానిక గ్రామ అధికారులను హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన తహశీల్దార్ డివిఎన్.అనిల్ కుమార్, ఎంపిడిఒ ఎ.మేరీ రోజ్ లతో కలసి కార్యదర్శులకు, విఆర్‌ఒలకు, బిఎల్‌ఒలకు, ఎంసిసి యాక్ట్ పై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ముందుగా వివిధ గ్రామాలలో ఫ్లెక్సీలు, లైటింగ్ ఓర్డింగులు ఫిర్యాదులపై గ్రామ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇప్పటివరకు వచ్చిన 11 ఫిర్యాదులపై ఆయన ఆరా తీశారు. ఇవి పునరావతం కాకుండా టీములుగా ఏర్పడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి అధికారి రాజకీయ పార్టీల నాయకులతో మర్యాదగా మాట్లాడుకుంటూ సమస్యలు లేకుండా చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలాలలో ఎటువంటి ఫ్లెక్సీలు, లైటింగ్ హోర్డింగ్‌లకు అనుమతి లేదన్నారు. ప్రయివేటు వ్యక్తుల స్థలాల్లో ఏర్పాటు చేస్తే దానికి సంబంధించి ఆ స్థల యజమాని ఎన్‌ఒసి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పర్మిషన్ పొందాల న్నారు. ఇలా ఎన్నికల నియమావళిపై తగిన జాగ్రత్తలు తీసుకుంటూ నిబంధనలు అమలు చేయాలన్నారు. వివిధ నిబంధన లకు సంబంధించి వివరాల పట్టికను తెలియజేశారు. ఇందులో సచివా లయ సిబ్బంది సహకారం తీసుకొని టీంలుగా ఏర్పడి పర్యవేక్షణ ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు సంజీవరెడ్డి, వీర్రాజు, సత్యనారాయణ, మోక్షాంజలి, వెంకట్ రెడ్డి, అయ్యన్న, రాజు, రేణుక, వేణి, వీరమాత, విఆర్‌ఒలు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

గ్రామ వాలంటీర్ల రాజీనామాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని నార్కెడిమిల్లి గ్రామానికి చెందిన 18 మంది గ్రామ వాలంటీర్లు శనివారం రాజీనామాలు చేశారు. ఈ సందర్భంగా రాజీనామా పత్రాలను ఎంపిడిఒ ఎం.వెంకటేశ్వరరావు అందజేశారు. విషయాన్ని గ్రామపంచాయతీ సెక్రెటరీ తెలియజేయునట్లు తెలిపారు.



రాజీనామా పత్రాలను అందజేస్తున్న వాలంటీర్లు

ఆరోగ్య సురక్ష లో 363 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి పంచాయతి కార్యాలయం లో నగరం పిహెచ్‌సి ఆధ్వర్యంలో శనివారం ఆరోగ్య సురక్ష నిర్వహించినట్లు వైద్యాధికారి కె.అనూష తెలిపారు. వైద్యుల బృందం 363 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు అందించారు. అనంతరం వైద్యుల మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వడ గాల్పు ల నేపథ్యంలో తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కలిపించారు.

భీమేశ్వరుని దర్శించుకున్న తెలంగాణ సిఎస్

ప్రజాశక్తి-రామచంద్రపురం

పంచారామ క్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతకుమారి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఇక్కడ భీమేశ్వర స్వామి వారి శివలింగానికి, శ్రీ మాణిక్యమ్మ అమ్మవారిని దర్శించుకుని ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. దీంతో పాటుగా కె. గంగవరం మండలంలోని కోటిపల్లి లో గల ఛాయాసోమేశ్వర స్వామి వారిని తెలంగాణ సిఎస్ దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆమె వెంట రామచంద్రపురం ఆర్‌డిఒ సుధాసాగర్, తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, ఆలయ ఇఒ తారకేశ్వరరావు, కె.గంగవరం తహశీల్దార్ రాధాకృష్ణ, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.



భీమేశ్వరఆలయంలో తెలంగాణ సిఎస్ శాంతకుమారి

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి -అమలాపురం

జిల్లా వ్యాప్తంగా పార్లమెంట్, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నిక ల అధికారి హిమాన్షు శుక్లా తెలి పారు శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా 26 జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పిలు జిల్లా జాయింట్ కలెక్టర్లతో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పై ఓటరు దరఖాస్తుల పరిష్కారం, సీజర్ మేనేజ్మెంట్ వ్యవస్థ , సి విజిల్, సువిధ యాప్ పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు తదితర అంశాల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అభ్యర్థులలు రాజకీయా పార్టీల ఇంటింటి ప్రచారం కోసం అనుమతులు తప్పని సరని ముందుగా ఆమేరకు సంబంధిత అధికారుల ద్వారా అనుమతులు పొందాలని సూచించారు. తదుపరి సంబంధిత ప్రాంతీయ పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలన్నారు. రాష్ట్ర స్థాయి పరిశీలకులు రావడం జరుగుతోందని. ఎన్నికల నిర్వహణలో నియమితులైన అధికార యంత్రాంగం పూర్తి జవాబుదారీతనంతో బాధ్యత యుతంగా వ్యవహరించి శాంతి యుతంగా, స్వేచ్ఛ యుతంగా నిష్పక్ష పాతంగా ఎన్నికలను నిర్వహిం చడంలో నిబద్ధత కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ లో ఎటువంటి సందేహాలున్న నివత్తి చేసుకొని బాధ్యతా యుతంగా మెలుగుతూ పారద ర్శకంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. సీజర్ మేనేజ్మెంట్ వ్యవస్థ విషయంలో ప్రత్యేక దష్టి సారించాలన్నారు. సువిధ యాప్ ద్వారా రాజకీయ పార్టీలు 48 గంటల ముందుగా అనుమతులు పొందాలన్నారు. సి విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించడం జరుగుతోందన్నారు. నిర్ణీత సమయం లోగా మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించాలన్నారు జిల్లాలో 1644 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి ఎస్.శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ అడ్మిన్ ఎస్‌పి ఖాదర్ బాషా, రిటర్నింగ్ అధికారులు ఎస్.సుధా సాగర్, జివివి.సత్యనా రాయణ, ఎ.శ్రీరామచంద్రమూర్తి, జి.కేశవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు

14న 'అరసం' మహాసభ

ప్రజాశక్తి-మండపేట

ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా ప్రథమ మహాసభ ఈనెల 14న అమలాపురం రూరల్ బండారులంక గ్రామంలోని ఒక ఆడిటోరియంలో నిర్వహిస్తారని అరసం కోనసీమ జిల్లా కన్వీనర్, రచయిత గండి స్వామి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభలో ముఖ్య అతిథులుగా జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పడాల వీరభద్రరావు, రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జున సాగర్, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు పూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా కోనసీమ జిల్లా అరసం నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని గండి స్వామి ప్రసాద్ తెలిపారు. సాహితీ ప్రియులు, భాషాభిమానులు, కవులు, రచయిత లు ఈ కార్యక్రమం లో పాల్గొని మహాసభ ను జయప్రదం చేయాలని కోరారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-మండపేట

పాలతోడు గ్రామానికి చెందిన పలువురు వైసిపి నాయకులు శనివారం టిడిపిలో చేరారు. మండపేట టిడిపి కార్యాలయంలో వీరంతా ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో వైసిపిని వీడి టిడిపిలో చేరారు. పార్టీలో చేరినవారిలో మందపల్లి యోహాన్, పైడిమళ్ళ ప్రవీణ్, మందపల్లి రాజబాబు, కొమ్ము ప్రవీణ్, మందపల్లి రాజు, మందపల్లి ప్రసాద్, మందపల్లి కళ్యాణ్ తదితరులు ఉన్నారు. పార్టీలో చేరిన వారందరికీ ఎంఎల్‌ఎ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టిడిపిలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం, గౌరవం ఉంటుందని ఎంఎల్‌ఎ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పిల్లా తాతాలు, మందపల్లి శ్రీనుబాబు, పట్టణ టిడిపి అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, కపిలేశ్వరపురం సర్పంచ్ శాకా శ్రీను, తదితర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో గొల్లపల్లి ప్రచారం

ప్రజాశక్తి -మామిడికుదురు

మాజీ మంత్రి రాజోలు నియోజకవర్గ వైసిపి అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు శనివారం పలుగ్రామాలలో పర్యటించి ప్రముఖులను ఆత్మీయంగా పాలకరించారు ఈదరాడలో యెరుబండి సూరిబాబు, ఎంపిపి కుసుమ వనజకుమారి, కొమరాడలో సర్పంచ్ వలవల సత్యవేణి సత్యమూర్తిలను కలిచి వారి సమస్య లు తెలుసుకుంటూ వాటికీ పరిస్కారమార్గాలు వివరించారు. మగటపల్లిలో సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మీ చంటిబాబు, సూరిశెట్టి మోహనరావు, సూరిశెట్టి బాబీ, బొలిశెట్టి భగవాన్‌లతో కలిసి గడప..గడపకూ ప్రచారం నిర్వహించి వారి సమస్యలు తెలుసుకన్నారు. గోగనమఠంలో నాయకుల తో కలిచి ప్రచారం నిర్వహించారు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన అతిథులు

'శ్రీ చైతన్య'లో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశకి-మండపేట

మండలం లోని తాపేశ్వరం శ్రీ చైతన్య లో స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మి నారాయణ అధ్వర్యంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక విద్యలో అడుగుపెడుతున్న యుకెజి విద్యార్థులకు, ప్రయిమరీ విద్య పూర్తి చేసుకుని హైస్కూల్లో అడుగుపెడుతున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పిజియోథెరపీ వైద్య నిపుణులు డాక్టర్ ఇమిడిశెట్టి విశ్వనాథ్ , వైద్యురాలు డాక్టర్ ఇమిడి శెట్టి జ్యోతిర్మయి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ లో ఇటువంటి కార్యక్రమాలు చేయడం విద్యార్థులకు ఎంతో ఉత్సాహాన్ని విశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. విశ్వాసం పట్టుదల విజయానికి మెట్లుగా మారతాయన్నారు. ఈ సందర్భంగా ఐఎన్‌టిఎస్‌ఒలో ఒలింపియాడ్ పోటీ పరీక్షలలో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయలు, విద్యార్థుల, విద్యార్థులు తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం సబ్ డివిజన్, అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమలాపురం పట్టణంలో గడియార స్తంభం సెంటర్, మునిసిపల్ కాలనీ, మార్కెట్ వీధి, కుమ్మరి కాలువ గట్టు, గణపతి థియేటర్ రోడ్డు మరియు కలశం సెంటర్ మరియు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ లు, సమస్యాత్మక గ్రామాల్లో స్థానిక పోలీసులు మరియు కేంద్ర బలగాలు సంయుక్తంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల విషయమై ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకొనేందుకు ప్రజలకు భరోసా కల్పించి అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. రామచంద్రాపురం డివిజన్ లో రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ములకలపల్లి గ్రామంలో మరియు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ లు, సమస్యాత్మక గ్రామాల్లో స్థానిక పోలీసులు మరియు కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

వెంకన్న ఆలయానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి -ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం యాత్రికులు పోటెత్తారు ఉదయం వేకువ జామున స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం దర్శనాలు ప్రారంభించారు. . రాత్రి 9 గంటల వరకు యాత్రికుల రద్దీ కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకీ పెరగడంతో యాత్రికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ భూపతి రాజు కిషోర్ కుమార్ ఏర్పాట్లను పూర్తి చేసి పర్యవేక్షించారు యాత్రికులు ఇబ్బందుల తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. వివిధ సేవలు వల్ల స్వామివారికి రూ.4 లక్షల ఆదాయం సమకూరింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా ఎస్‌ఐ ఎన్.శ్రీనివాస్ ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు..

వైసిపిలో జనసేన నేతల చేరిక

ప్రజాశక్తి-అమలాపురం

నెల్లూరు జిల్లాలో వైసిపి నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం యాత్రలో భాగంగా సిఎం జగన్ సమక్షంలో అమలాపురం నియోజకవర్గనికి చెందిన జనసేన నాయకులు పార్టీలో చేరారు. నెల్లూరు జిల్లా ఆర్‌ఎస్‌ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్లో సిఎం జగన్ భోజన విరామ సమయంలో జనసేన నేతలను సిఎం జగన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు, తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనుబాబు, ఎస్‌సి డివిజన్ రాష్ట్ర నాయకుడు ఎం.శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి సభ్యుడు సిహెచ్. వెంకటేశ్వరరావు, జనసేన వీర మహిళా నాయకురాలు చెట్టి సుభాషిణి, జనసేన అమలాపురం మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కె. చినబాబు, జనసేన పార్టీలోని వివిధ విభాగాలకు చెందిన ఇతర నాయకులు ఎన్నికలకు కొద్ది రోజుల ముందు లాంఛనంగా వైసిపిలో చేరారు.

బాల బాలాజీ ఆదాయం రూ.1.61 లక్షలు

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ ఆలయానికి శనివారం లడ్డు ప్రసాదం, దర్శనము టిక్కెట్లు ద్వారా రూ.1,11,180, నిత్యాన్నదానట్రస్ట్‌కు రూ.49,858 మొత్తం రూ.1,61,038 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు. 2694మంది స్వామి వారి దర్శనం చేసు కోగా 2017మంది అన్నప్రసాదం స్వీకరించరని అన్నారు.


కోడ్ ఉల్లంఘినపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ఐ.పోలవరం

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వైసిపి నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని మండల అభివృద్ధి అధికారికి ఫిర్యాదు చేసినట్లు ఎమ్ఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి శనివారం విలేకర్లకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా టి.కొత్తపల్లి గ్రామ పంచాయతీ అరుంధతి నగర్‌లో వైసిపి ఎన్నికల ప్రచారంలో ఆ పార్టీ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ముసుగు తొలగించి పూలమాల వేశారని అన్నారు.

ఈ విషయంపై ఐ.పోలవరం మండల అభివృద్ధి అధికారికి ఫిర్యాదు చేసినటు ఆయన తెలిపారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ముసుగు తొలగించి పూలదండ వేసిన వైసిపి నాయకులపై ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

సారా స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని నుంచి సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తమ సిబ్బందితో తాడిపూడి గ్రామ శివారున నాటు సారా తరలిస్తున్న గ్రామానికి చెందిన విప్పర్తి వరప్రసాదు అదుపులో తీసుకున్నారు. అతను వద్ద నుండి 10 లీటర్ల నాటు సారాను స్వాధీన చేసుకొని కేసు నమోదు చేశారు. నిందితుడిని కొత్తపేట జెఎఫ్‌సిఎం కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

మోటార్ సైకిల్ చోరీ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి వెంకన్న దేవస్థానం వారి పార్కింగ్ ప్రదేశంలో శనివారం మోటార్‌సైకిల్ చోరీ జరిగింది. వివరాలు ఇవి.. సీతానగరం మండలం సీతానగరానికి చెందిన పేపకాయల సుబ్రహ్మణ్యం దంపతులు శనివారం వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చారు. వారు తమ మోటార్ సైకిల్‌ను దేవస్థానం వారి పార్కింగ్ ప్రదేశంలో నిలుపుదల చేశారు. అనంతరం వారు రసీదు తీసుకుని స్వామివారి దర్శనానికి వెళ్లారు. వారు తిరిగి వచ్చేసరికి తమ మోటార్ సైకిల్ లేకపోవడంతో పార్కింగ్ పాటదారుడిని అడిగారు. అయితే తమకు ఏమీ సంబంధం లేదని పార్కింగ్ పాటదారుడు పొంతలేని సమాధానం చెప్పాడు.బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తహశీల్దారు వద్ద నిందితుల బైండోవర్

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని జగన్నాథపురంలో పలువురు నిందితులను తహశీల్దారు వద్ద బైండోవర్ చేసినట్లు ఎస్ఐబి ఎబై కె.వి స్వామి తెలిపారు. మండలానికి చెందిన 9 మందిని బెండ్ ఓవర్ చేసినట్లు సిఐ కెవి స్వామి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-కడియం

మండల కేంద్రమైన కడియం తూర్పు డెల్టా ప్రధాన కాలువలో కర్రల మిల్లు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కాలువలో తేలుతున్నట్లు స్థానికుల ద్వారా అందిన సమాచారంతో స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతుని వయసు సుమారు 30 ఏళ్లు ఉంటుందని తెలిపారు. కడియం విఆర్ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు కడియం పోలీసు స్టేషన్ 9440796587, 7995164821 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బైక్‌లో చోరీ కేసుల్లో ఐదుగురి అరెస్ట్

చెడు వ్యసనాలకు బానిసలైన ఐదుగురి వ్యక్తులను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇవి..

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉండ్రాజవరంచెడు వ్యసనాలకు బానిసలై, వాహనాలు చోరీ చేస్తున్న ఇద్దరిని ఇద్దరిని అరెస్టు చేసినట్లు నిడదవోలు సిఐ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిడదవోలు మండలానికి చెందిన బొద్దురి సతీష్, తాతోలు రామకృష్ణ విలాసాలకు అలవాటు పడి, ఊరు బయట, పార్కింగ్ ప్రదేశాలు, నిర్మానుష్య ప్రదేశాలు, రాత్రి సమయంలో ఇంటి బయట ఉన్న బైకులను అపహరించి అమ్ముకుంటున్నట్లు తెలిపారు. వారిని శనివారం మండల కేంద్రం ఉండ్రాజవరం పెట్రోల్ బంకు వద్ద ఎస్ఐ వి.అప్పలరాజు, సిబ్బందితో కలిసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. **మండపేట** పట్టణం తో పాటు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను దొంగలించిన ముగ్గురిని టౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు.ఎస్ఐ హరి కోటి శాస్త్రి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కల్వపువ్వు సెంటర్లో ఈ నెల 4న ఓ మోటార్ సైకిల్ చోరీకు గురైంది. పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. ఇటీవల జిల్లాలో మోటార్ సైకిల్ చోరీలు ఎక్కువగా ఉన్నాయని జిల్లా ఎస్పి ఎస్ శ్రీధర్ ఆదేశాలతో రామచంద్రపురం డిఎస్పి రామకష్ణ, టౌన్ సిఐ అఖిల్ జమ, ఎస్ఐ హరికోటి శాస్త్రి, పోలీస్ కానిస్టేబుల్ సతీష్, రమేష్‌లను ఒక బందంగా ఏర్పాటు చేశారు. మోటర్ సైకిల్ దొంగతనాలు పాల్పడుతున్న నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ నేపథ్యంలో శనివారం బైపాస్ సంఘం కాలనీ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురిని టౌన్ ఎస్ఐ పట్టుకున్నారు. చెడు వ్యసనాలకు బానిసలై సులువుగా డబ్బులు సంపాదించాలని కోరికతో మోటార్ సైకిల్ దొంగలించినట్లు గోకవరం మండలం మొల్లేటి మల్లవరం గ్రామానికి చెందిన ముచ్చకర్ల ప్రసాద్, మండపేట మండలం ఇప్పనపాడుకు చెందిన ముక్కా అప్పారావు, గోకవరం మండలం మోల్లేటి మల్లవరం చెందిన బురుకట్ట కాట స్వామిలు జగ్గంపేట, ఏలేశ్వరం, మండపేట టౌన్, పెద్దాపురం ల్లో ఒక్కో వాహనాన్ని, వైజాగ్ లో రెండు చోట్ల దొంగతనం చేసినట్లు వెల్లడించారు. దొంగలించిన మోటార్ సైకిల్ లను పట్టణంలోని గొల్లపుంత టిడ్కో అపార్ట్మెంట్ల వెనుక భాగంలో దాచి పెట్టారు. ఈ మోటార్ సైకిల్ లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆరు మోటర్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామని వీటి విలువ రూ.5లక్షలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. నిందితులను ఆలమూరు మెజిస్టిక్ ముందు హాజరు పరిచారు. ఈనెల 12 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి అదేశించారని ఎస్ ఐ చెప్పారు.వీరిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి కేసు చేదించిన రామచంద్రపురం డిఎస్పి రామకష్ణ, టౌన్ సి అఖిల్ జమ, టౌన్ ఎస్ఐ శాస్త్రి, కానిస్టేబుల్ సతీష్, రమేష్ లను జిల్లా ఎస్పీ శ్రీధర్ అభినందించారు.



అరెస్టు చేసిన నిందితులతో సిఐ, తదితరులు

వేడెక్కిన రాజకీయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఒక వైపు వేడెక్కుతున్న ఉష్ణోగ్రతలు..మరోవైపు 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వేడిని పుట్టిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అభ్యర్థుల హోరా హోరీ ప్రచారాలు పతాక స్థాయికి చేరుకున్నాయి. వేసవి ఉష్ణోగ్రతలకు రాజకీయ నేతల సభలు, సమావేశాలతో పొలిటికల్ హీట్ ఒక్కసారిగా పెరిగింది. టిడిపి, జనసేన కూటమి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. గడిచిన వారం రోజుల్లో పిఠాపురంలో పవన్ కళ్యాణ్ రోడ్ షో నిర్వహించి స్థానిక నేతలతో దశల వారీ సమావేశం అయ్యారు. మరోవైపు టిడిపి అధినేత చంద్రబాబు అమలాపురం, తూర్పు గోదావరి జిల్లాల్లో విస్తృతంగా రోడ్ షో నిర్వహించి తమ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించడంతోపాటు అసంతృప్తివాదులను బుజ్జగించారు. అయితే గోపాలపురం నియోజకవర్గంలో చేదు అనుభవమే ఎదురైంది. చంద్రబాబు ప్రకటించిన అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజుకు వ్యతిరేకంగా నినాదాలు చేయటంతోపాటు అధికార వైసిపి అభ్యర్థి తానేటి వనితకు జైజైలు పలకటం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనతో అధినేత తీవ్ర కోపోద్రిక్తుడై మరోసారి క్రమశిక్షణా పాఠాలు చెప్పి వెనుదిరిగారు. అయితే చంద్రబాబు పర్యటన జిల్లా ప్రజలను ఏ మేరకు ప్రభావితం చేసిందో వేచి చూడాల్సి ఉంది.

బిజెపిలో లుకలుకలు

బిజెపిలో లుకలుకలు మొదలయ్యాయి. ఆ పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రాజమహేంద్రవరం ఎంపి అభ్యర్థిగా బరిలో నిలిచారు. అదే పార్టీకి చెందిన ఓ సీనియర్ నేత, ఎపి బిజెపి మాజీ అధ్యక్షులు సోము వీర్రాజు ఎంపి టికెట్ ఆశించారు. ఆ పార్టీ ప్రకటించకముందే తనే అభ్యర్థినంటూ జిల్లాలో పలు చోట్ల పోస్టర్లు సైతం ఆతికించుకున్నారు. మరో అడుగు ముందుకేసి పాత్రికేయుల సమావేశం నిర్వహించి ఎంపి లేదా అసెంబ్లీ నియోజక వర్గ అభ్యర్థిగా బరిలో ఉంటానని ప్రకటించారు. అయితే సదరు నేత ఆశలపై ఆ పార్టీ నీళ్లు చల్లింది. దగ్గుబాటి పురందేశ్వరిని అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో సదరు సీనియర్ నేత వైఖరికే వర్గాన్ని కూడగడుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గడిచిన తొమ్మిదేళ్లలో కేంద్రంలోని బిజెపీ రాష్ట్రానికి ఒక్కటీ చేసింది చూపించి. ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం, కొనసీమ రైల్వే లైను తదితర ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల్లో నిర్లక్ష్యంగానే వ్యవహరించింది. అటువంటి బిజెపీ అభ్యర్థులకు ప్రచారంలోనే పరాభవం తప్పదన్నట్లుగా పరిస్థితి నెలకొంది. తాజాగా జిల్లాలో ప్రచార కార్యక్రమాల్లో ప్రారంభించిన ఆ పార్టీకి ఎటువంటి అనుభవాలు ఎదురవుతాయో వేచి చూడాలి.

పేపరు మిల్లు కార్మికుల మెరుపు సమ్మె

ఉమ్మడి జిల్లాలో భారీ పరిశ్రమల్లో ఒకటైన ఎపి పేపరు మిల్లులో ఈ వారంలో సమ్మె సైరెన్ మోగింది. కార్మికులకు వేతన ఒప్పందం చేయకుండా గత నాలుగేళ్లుగా యాజమాన్యం తాత్సారం చేస్తూ వస్తుంది. ఈ నేపథ్యంలో కార్మికులు దశల వారీ ఆందోళనలు నిర్వహించారు. ఎట్టకేలకు ఉన్నతాధికారుల జోక్యంతో చర్చలు జరిగినప్పటికీ ఫలితం లేకపోయింది. అధికారుల సూచనలను సైతం యాజమాన్యం బేఖాతరు చేయటం నిర్లక్ష్య వైఖరిని దర్పనం పట్టింది. ఈ నేపథ్యంలో చేపట్టిన సమ్మె నేటితో ఐదో రోజుకి చేరింది. సోమవారం మరోసారి చర్చలు నిర్వహించేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. అయితే యాజమాన్యం ఏ మేరకు దిగొస్తుందో వేచి చూడాల్సి ఉంది. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో సుమారు 3 వేల మంది కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి కూటమి నేతలు కనీస స్పందన లేకపోవటం ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధి లేమిని స్పష్టం చేస్తుంది. కార్మికులు ప్రారంభించిన సమ్మె పతాక స్థాయికి చేరుకుంటున్న నేపథ్యంలో ఇప్పటికైనా స్పందించకపోతే రాబోయే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సుస్పష్టమవుతోంది.





మీడియా తో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

1,785 పోలింగ్ స్టేషన్‌లో శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - జగ్గంపేట

కాకినాడ జిల్లాలో 1785 పోలింగ్ స్టేషన్‌లలో సిబ్బందిని నియమించి శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ నివాస్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ పోలింగ్ స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. నియోజవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు నిర్వహణ ఇవిఎంలు భద్రత, వివిధ ప్రాంతాలకు ఎలా పంపుతారు అనే వివరాలను అడిగి తెలుసుకుని, వారికి పలు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్నిచోట్ల ఏర్పాట్లు బాగున్నాయని, వచ్చేవారం సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కరప

రాజ్యాంగం కల్పించిన ఓటును ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని రూరల్ సిఐ కె.శ్రీనివాసరావు కోరారు. శనివారం ఎస్ఐ టి.రామకృష్ణతో కలిసి యండమూరు గ్రామంలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌ను సందర్శించారు. ఎన్నికలు సక్రమంగా జరగడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ఆర్‌టిసి బస్సు వెనుక చక్రంలో మంటలు

ప్రజాశక్తి - సామర్లకోట

రాజమహేంద్రవరం నుంచి కాకినాడ ప్రయాణికులతో వెళ్తున్న ఆర్‌టిసి బస్సు వెనుక చక్రంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అయితే డ్రయివర్ అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వెళ్తున్న ఆర్‌టిసి బస్సు సామర్లకోట మెహర్ కాంప్లెక్స్ సెంటర్ సమీపంలో బస్సు వెనుక టైర్ నుంచి మంటలు వ్యాపించాయి. ప్రమాదాన్ని గుర్తించిన డ్రయివర్ వెంటనే బస్సును నిలిపివేసి ప్రయాణికులను సురక్షితంగా కిందికి దించి వేశారు. వెంటనే పక్కనే ఉన్న దుకాణం నుంచి నీటిని తీసుకుని మంటలను అదుపు చేశారు. ప్రయాణికులను మరో బస్సు ఎక్కించి పంపించారు. వెనక చక్రం బ్రేకు పట్టి పొగలు వచ్చినట్టుగా డ్రయివర్ అనుమానం వ్యక్తం చేశారు.



మంటలు అదుపు చేస్తున్న డ్రైవర్

వెంకటాపురంలో పలువురికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య కాలేజీ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వెంకటాపురం గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగానే మందులను పంపిణీ చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవిశంకర్ తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలరను వివరించారు.

ఈ కార్యక్రమంలో ద్వారంపూడి శ్రీనివాస్, ద్వారంపూడి మణికంఠచక్రవర్తి, ముంగి గంగాధర్, ఎన్ఎస్ఎస్ పిఒలు పి.ప్రశాంతి, రేణుక, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మండుటెండలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుచేసిన శ్రీ సద్గురు సాయిబాబు ట్రస్ట్ సేవలు అభినందనీయమని సర్పవరం సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, ఎపిఐఐసి డిజెడ్ఎం జ్యోత్స్న అన్నారు. స్థానిక రమణయ్యపేట భవాని క్యాస్టింగ్ ఎదురుగా ఎపిఐఐసి కాలనీ వద్ద ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద శ్రీ సద్గురు సాయి బాబా ట్రస్ట్ వ్యవస్థాపకులు కోలుకొండ రాంబాబు మీనాక్షి దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ, రస్నా చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండల తీవ్రత రోజు రోజుకు పెరిగి పోతుందని, నిత్యం పరిసర గ్రామాల నుంచి వివిధ పనుల కోసం కాకినాడకు ప్రజలు వస్తుంటారని, వారి దాహార్తి తీర్చడానికి ఇలాంటి చలి వేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. శ్రీ సద్గురు సాయిబాబా ట్రస్ట్ వ్యవస్థాపకులు సాయిరాం మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి ఇంజనీరింగ్ డిజెడ్ఎం రాధామణి, మేనేజర్ సాయిబాబా, వర్క్ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన సిఐని సత్కరిస్తున్న నిర్వాహకులు



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సిడిపిఒ

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక పాత పెద్దాపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ జి ఉష అధ్యక్షతన గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిడిపిఒ ఉష మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు ఆరోగ్య పరిరక్షణ కోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఎఎన్ఎం దుర్గ, ఆశా వర్కర్ లలిత, అంగన్‌వాడీ కార్యకర్త తులసి, ఆయా జయ పాల్గొన్నారు.

నూకాలమ్మ జాతరకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - పెద్దాపురం

కాండ్రకోట గ్రామంలోని నూకాలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఇఒ తలాటం వెంకట సూర్యనారాయణ తెలిపారు. శనివారం ఆలయం వద్ద ధర్మకర్తలతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభమై మే 21వ తేదీ వరకు 45 రోజులపాటు ఈ జాతర సాగుతుందన్నారు. 7 వ తేదీ రాత్రి జరిగే ఈ జాగరణ ఉత్సవానికి వేలాదిగా యాత్రికులు తరలివస్తారని వారికి ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో ధర్మకర్తల మండలి చైర్మన్ గవరసాన వీరాస్వామి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పూర్తి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామాల్లో నూరు శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపిడిఒ జి.ఉషారాణి తెలిపారు. శనివారం తిరుపతి, చదలాడ, చంద్రమాంపల్లి, దివిలి గ్రామాలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో 11962 మంది పింఛన్ల లబ్ధిదారులు ఉండగా శనివారం సాయంత్రానికి వీరిలో 11960 మందికి పింఛన్లు పంపిణీ జరిగిందన్నారు. చదలాడ గ్రామంలోని పాండురంగ స్వామి ఆలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. పంచాయతీల కార్యదర్శులు జ్యోతుల పద్మరాజు, ఈశ్వరరావు, భార్గవ్ పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత

మండలంలోని చదలాడ గ్రామానికి చెందిన రాజారత్నం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మణికంఠ శనివారం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న రాజారత్నంకు పింఛను అందజేశారు.

'చేయూత' నిధుల కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి-రామచంద్రపురం

వైసిపి ప్రభుత్వం 45 సంవత్సరాల దాటిన మహిళలందరికీ చేయూత పథకం కింద ప్రతి ఏటా రూ.18,500 లు అందజేస్తామని ఎన్నికల్లో ప్రకటించారు. గత ఏడాది ఆగస్టులో వేయాల్సిన చేయూత పథకం నిధులు ఆలస్యంగా 2024 మార్చి 7 అనకాపల్లిలో జరిగిన బహిరంగ సభలో స్వయంగా సిఎం జగన్ బటన్ నొక్కి విడుదల చేశారు. ఇప్పటికి నెల రోజులైనా మహిళల ఖాతాల్లో ఆ సొమ్ము జమ కాలేదు. దీంతో లబ్ధిదారులు చేయూత పథకం నిధులపై పలువురిని ఆరా తీస్తుండగా కొందరు బ్యాంకుల చుట్టూ ఆ సొమ్ముల కోసం తిరుగుతున్నారు. ప్రతి ఏటా బటన్ నొక్కిన వారం రోజుల్లోగా నిధులు జమ అయ్యేవి ఈ ఏడాది నెల రోజులైనా సొమ్ములు జమ కాకపోవడంతో ఖాతాల్లో చేయూత నిధులు పడతాయా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

100 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మల్లిశాల గ్రామంలో శనివారం జగ్గంపేట సిఐ, ఎస్ఐలు తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. అక్రమంగా సారా విక్రయిస్తున్న సమాచారం వచ్చిన మేరకు నిర్వహించిన దాడుల్లో ఆ గ్రామానికి చెందిన గీసాల రమణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 100 లీటర్ల నాటు సారా ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.నాగార్జురాజు తెలిపారు.

యానాం వార్తలు

యానాంలో ముగిసిన బ్యాలెట్ ఓటింగ్

ప్రజాశక్తి - యానాం

ఈనెల 19న జరగనున్న ఎన్నికల్లో 85 ఏళ్లు పైబడిన, దివ్యాంగులైన ఓటర్లకు ఓట్లు వేసేందుకు ఈనెల 2నుంచి జరుగుతున్న బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ శనివారంతో ముగిసింది. రెండవ తేదీనుంచి 6వ తేదీవరకు 85 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్స్ నుంచి 110 బ్యాలెట్ ఓట్లు స్వీకరించగా, వికలాంగుల నుంచి 178 ఓట్లు మొత్తం 288 ఓట్లు బ్యాలెట్ బాక్స్ ద్వారా స్వీకరించినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆర్.మునిస్వామి తెలిపారు. మొత్తం 302 బ్యాలెట్ ఓట్లకు 288 ఓట్లు పోల్ అయ్యాయని, 14 ఓట్లు పోల్ అవ్వలేదని ఆయన తెలిపారు.

మల్లాడి సత్తిబాబు ప్రచారం

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 19న జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధి వి.వైధిలింగంను గెలిపించాలంటూ యానాం ఎన్నికల ఇన్‌ఛార్జ్ మల్లాడి సత్తిబాబు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. శనివారం గిరియాం పేట, దరియాలతిప్ప, దొమ్మేటిపేట, సీతారామ నగర్ గ్రామాల్లో ఆయన ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. ఐదు గ్యారంటీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మేలు చేస్తుందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లాడి బీరాస్వామి, ప్రసాద్ రాజు, సత్యనారాయణ రాజు, లంకే అంజయ్య,. కె.శ్రీను, సుబ్బారావు, చక్రవర్తి, బంగారం పాల్గొన్నారు.

ముషిణికి సీటు కేటాయించకపోవడం దారుణం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముషిణి రామకృష్ణారావుకు సీటు కేటాయించకపోవడం దారుణమని కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు అభిప్రాయపడ్డారు. శనివారం ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పి.ఉదయభాస్కరవర్మ, ముమ్మిడివరం నగర పంచాయతీ అధ్యక్షుడు శివప్రసాద్, రెడ్డి త్రిమూర్తులు ఓ ప్రకటనను విడుదల చేశారు. గత కొన్ని దశాబ్దాల నుంచి కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న వారిని విస్మరించడం సరికాదని అన్నారు. నిన్నగాక మొన్న పార్టీలోకి వచ్చి దరఖాస్తు పెట్టిన వారికి టిక్కెట్లు కేటాయించడం వల్ల కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముషిణి రామకృష్ణారావుకు సీటును కేటాయించకపోవడం పార్టీ శ్రేణులను నిరుత్సాహానికి గురిచేసిందని అభిప్రాయపడ్డారు.